చదువు
10
హైదరాబాద్
మంగళవారం మార్చి 5, 2024
ఈనాడు
e-mail: edc@eenadu.in

టౌన్ ప్లానింగ్‌లో పీజీ గానీ, డిప్లొమా కోర్సు గానీ కరస్పాండెన్స్ పద్ధతిలో ఏ యూనివర్సిటీలు అందిస్తున్నాయి? - హరికృష్ణ

అర్బన్ ప్లానింగ్ కోర్సులు ఎక్కడ?

■ టౌన్/ అర్బన్ ప్లానింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సుల్ని రెగ్యులర్ పద్ధతిలో చదివితేనే వృత్తి నైపుణ్యాలు మెరుగవుతాయి. ఒకవేళ, మీరు ప్రస్తుతం అదే రంగంలో పనిచేస్తూ, విద్యార్హతలు పెంచుకోవాలనుకొంటే కరస్పాండెన్స్/ డిస్టెన్స్/ ఓపెన్/ ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీ/ పీజీ డిప్లొమా/ పీజీ కోర్సులు ఉపయోగపడతాయి. సాధారణంగా టౌన్ ప్లానింగ్‌లో పీజీ కోర్సులను ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలు బీఆర్క్ చదివినవారికి మాత్రమే రెగ్యులర్ పద్ధతిలో అందిస్తున్నాయి. అతికొద్ది విద్యాసంస్థలు మాత్రమే టౌన్/ అర్బన్ ప్లానింగ్‌లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నాయి. ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) పీజీ డిప్లొమా ఇన్ అర్బన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంని అందిస్తోంది. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, దిల్లీ.. సిటీ అండ్ మెట్రోపాలిటన్ ప్లానింగ్‌నూ, ఐఐటీ ఖరగ్‌పూర్.. అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్స్‌లో, ఐఐటీ రూర్కీ.. ఇంట్రడక్షన్ టు సర్వీసెస్ ప్లానింగ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను 'స్వయం' పోర్టల్ ద్వారా అందిస్తున్నాయి. ఇవే కాకుండా కొన్ని ప్రైవేటు/ విదేశీ యూనివర్సిటీలు కూడా టౌన్/ అర్బన్ ప్లానింగ్‌లో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఆ సంస్థల విశ్వసనీయత పూర్తిగా తెలుసుకొని ప్రవేశం విషయంలో సరైన నిర్ణయం తీసుకోండి. ది గ్లోబల్ ఓపెన్ యూనివర్సిటీ, నాగాలాండ్‌లో అర్బన్ ప్లానింగ్‌లో ఎమ్మెస్సీ ప్రోగ్రాం దూరవిద్య ద్వారా అందుబాటులో ఉంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఓ పక్క కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు హిమబిందు, చైతన్య. ఈ ఇద్దరు మహిళలూ గత ఏడాది గురుకుల విద్యాసంస్థ అధ్యాపక పోస్టులకు నియామక పరీక్షలు రాశారు.. జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాఠశాల విభాగాల్లో చక్కని ప్రతిభ చూపి ఇటీవలే కొలువులకు ఎంపికయ్యారు. స్ఫూర్తిదాయకమైన వీరి కృషి వారి మాటల్లోనే..

అదరగొట్టారు!

మూడేసి ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

చదువుతూనే ఉన్నా..

● బండి హిమబిందు

చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో బాగా చదివేదాన్ని. 6వ తరగతిలో మామ్‌నూరు, వరంగల్ నవోదయలో సీటు వచ్చింది. మా ఊరిలో అలా సీటు సాధించిన మొట్టమొదటి అమ్మాయిని నేనే! దాంతో వెంటనే చేరిపోయా. ఇంటర్ వరకూ అక్కడే చదువుకుని డిగ్రీ బీఎస్సీ ఎంపీసీ, పీజీ కెమిస్ట్రీ కూడా పూర్తిచేశాను. తర్వాత లైబ్రరీ సైన్స్‌పై ఆసక్తితో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా మళ్లీ పీజీ చదివాను. ఈలోగా పెళ్లయింది, ఇద్దరు పిల్లలు కూడా. 2021లో నెట్‌కి ఎంపికయ్యాను, 2023లో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో జేఆర్‌ఎఫ్‌కి ఎంపికయ్యాను. గురుకులాల్లో పోస్టులకు నోటిఫికేషన్ పడటంతో చదివి పరీక్షలు రాశాను. వీటిలో స్కూల్, జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ లైబ్రేరియన్ పోస్టులు మూడింటికీ సెలెక్ట్ అయ్యాను. ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో చేరేందుకు నిర్ణయించుకున్నాను. వీటికి సంబంధించిన నోటిఫికేషన్‌లో జనరల్‌లో 36వ ర్యాంకు, మహిళా కేటగిరీలో 2వ ర్యాంకు లభించింది.

« 2010లో డిగ్రీ పూర్తయ్యింది, 2015లో పెళ్లయింది. అప్పటి నుంచి చదువుతూనే ఉన్నా. ఇందుకు మా నాన్న, మావారు చాలా సహకరించారు. ఆఖరికి పిల్లలు పుట్టిన సమయాల్లో కూడా ఎక్కువ రోజులు పుస్తకాలకు దూరం కాలేదు. ఓ పక్క ఇంట్లో పనులు, పిల్లలను చూసుకుంటూనే మధ్యాహ్నాలు కాస్త సమయం చిక్కించుకుని చదువుకునేదాన్ని. అలా అని రోజుకు ఎక్కువ సమయం కూడా దొరికేది కాదు. మహా అయితే 3 గంటలు కేటాయించగలిగాను. కానీ ఆ సమయంలోనే పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం చదువుకున్నా. ఈ ఉద్యోగాలు రాకముందు, పెళ్లికాక ముందు రైల్వే, బ్యాంకింగ్ వంటి చాలా నోటిఫికేషన్లకు పరీక్షలు రాశాను. గత మూడేళ్లుగా మాత్రం పూర్తిగా వీటి మీదనే ధ్యాస పెట్టాను. అమ్మ, అత్త పిల్లలను చూసుకోవడంలో సాయం చేసేవారు. మొత్తం కుటుంబం సహకారం లేకపోతే ఇలా చదవగలిగేదాన్ని కాదు. పరీక్షల ముందు మొత్తం పుస్తకాలతోనే గడిపేదాన్ని. ఆ టైమ్‌లో పిల్లలకు సమయం కేటాయించలేక వారిని చాలా మిస్ అయ్యేదాన్ని కూడా. కానీ ఉద్యోగం వస్తే వారికి మెరుగైన భవిష్యత్తు ఇవ్వొచ్చనే ఆలోచన నన్ను ఉత్సాహపరిచేది.

« మొదటి నుంచీ ఆర్థికంగా స్వాతంత్ర్యం ఉండాలనే ఆలోచన నాది. అందుకు మావారు కూడా సహకరించారు. ఇప్పుడు మా బాబుకు ఏడేళ్లు, పాపకు ఐదేళ్లు. అమ్మ ఏదో సాధించిందనే విషయం వారికి కూడా అర్థం అవుతోంది, నా విజయం పట్ల వారి సంతోషం చూస్తుంటే ఇన్నేళ్లు పడ్డ కష్టం అంతా మర్చిపోతున్నా.

« ప్రస్తుత నోటిఫికేషన్‌లో మెరుగైన ర్యాంకు సాధించడానికి పాత పరీక్షలు రాసిన అనుభవం కూడా ఉపయోగపడింది. ఇన్నేళ్లలో ఎప్పుడూ ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. నావద్ద ఉన్న మెటీరియల్, మార్కెట్‌లో దొరికే కొద్దిపాటి బుక్స్, ఆన్‌లైన్‌లోనే చదువుకున్నా.

ప్రాథమిక అంశాలతో మొదలు..

ప్రతి సబ్జెక్టుకు ప్రాథమిక అంశాలపై బాగా పట్టు సంపాదించా. ఆ తర్వాత ఎగ్జామ్‌కి సంబంధించి అన్ని కోణాల్లోనూ చదివేదాన్ని. 'ఈపీజీ పాఠశాల' అనే సైట్ మెటీరియల్ తీసుకుని పదే పదే రివైజ్ చేయడం ఉపయోగపడింది. ఎక్కువ ఒత్తిడి తీసుకోకుండా ప్రశాంతంగా, ప్రణాళికతో చదివా. రోజూ ఎంతోకొంత చదువుతూ ఉంటే ఎంత కష్టమైన టాపిక్ అయినా సులువుగా గ్రహించవచ్చు.

« రోజుకు ఎన్ని గంటలు చదివాం అనేది కాకుండా ఎలా చదివాం అనేది ముఖ్యం. ఫోకస్ తప్పకుండా ప్రిపేర్ అయ్యాను. గత ఏడాది ప్రశ్నపత్రాలు బాగా చూశాను. కేవలం ప్రశ్న, జవాబు కాకుండా కంటెంట్ మొత్తం అర్థం అయ్యేలా చదివాను, అంటే ఆ పాఠం నుంచి ప్రశ్న ఎలా వచ్చినా జవాబు ఇచ్చేలా నా సన్నద్ధత కొనసాగింది. ఒక పాఠం పూర్తికాగానే దానికి తగిన విధంగా నోట్స్ రాసుకున్నాను, దానికి సంబంధించి వీలైనన్ని బిట్స్ ప్రాక్టీస్ చేశాను, రాసుకున్న నోట్సును మళ్లీ మళ్లీ రివైజ్ చేశాను.

« నిజానికి మాకు నోటిఫికేషన్ల కోసం చూడటంలోనే సమయం చాలా గడిచిపోయింది. కానీ నేను ఆ విషయానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వలేదు.. చదువుతూనే ఉన్నా. ఎంత నిరాశగా అనిపించినా ఎప్పుడూ చదువు ఆపేద్దాం అనిపించలేదు. ఏం కాదు, కచ్చితంగా ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఇంట్లోవారు కల్పించేవారు.

« పోటీ పరీక్షల సన్నద్ధత అంటే ఒత్తిడి చాలా సాధారణం. కానీ దాన్ని వీలైనంతగా అదుపులో ఉంచుకునేదాన్ని. మరీ చిరాగ్గా అనిపిస్తే కుటుంబంతో సమయం గడిపేదాన్ని. ప్రస్తుతం జాబ్‌లో జాయిన్ అయ్యాక పరిస్థితులు చూసి పీహెచ్‌డీలో చేరదాం అనుకుంటున్నా!

వరంగల్ జిల్లా ధర్మారంలో పదోతరగతి వరకూ చదివాను. పదిలో 510 మార్కులొచ్చాయి. దాంతో బాసర ట్రిపుల్ఐటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కంప్యూటర్ సైన్స్ సీటు దొరికింది. నిజానికి నాకు మొదటి నుంచీ సోషల్ సైన్సెస్ పైనే ఆసక్తి ఎక్కువ. కానీ అప్పుడు సాఫ్ట్‌వేర్ రంగం కొత్తగా వేళ్లూనుకుంటూ ఉండటం.. ట్రిపుల్ఐటీ మొదటి బ్యాచ్‌లోనే సీటు రావడంతో అందులో చేరాను. చదువు పూర్తయ్యాక ఐటీ జాబ్‌లో చేరడంపై ఇష్టం లేకపోయింది. దాంతో ఉస్మానియాలో జర్నలిజంలో పీజీ కోర్సులో చేరాను. ఆ తర్వాత లైబ్రరీ సైన్స్‌లో కూడా పీజీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వడం మొదలుపెట్టాను.

« మొదట గ్రూప్-1 కోసం చదవడం మొదలుపెట్టినా.. ఆలోగా గురుకులాల నోటిఫికేషన్లు రిలీజ్ అయ్యాయి. డీఎల్, జేఎల్, స్కూల్ లైబ్రేరియన్ పోస్టులకు దరఖాస్తు చేశాను. తర్వాత పాలిటెక్నిక్ జేఎల్ నోటిఫికేషన్ పడింది. ఆ పరీక్ష కూడా రాశాను. అందులో మహిళా కేటగిరీలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు, జనరల్‌లో 4వ ర్యాంకు లభించాయి. తర్వాత గ్రూప్-4 పరీక్షకు హాజరయ్యాను. జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌లో జిల్లాలో 175 ర్యాంకు వచ్చింది. ప్రస్తుతం గురుకులాల్లో డీఎల్, జేఎల్, స్కూల్ లైబ్రేరియన్ పోస్టులకు సెలెక్ట్ అయ్యాను, పాలిటెక్నికల్ జేఎల్ కూడా మంచి ర్యాంకు రావడంతో ఉద్యోగం వస్తుందనే అనుకుంటున్నా, అదే సమయంలో గ్రూప్-1కి కూడా ప్రిపేర్ అవుతున్నాను.

« చిన్నప్పటి నుంచి సోషల్ సైన్సెస్ మీద ఆసక్తి ఎక్కువ, వ్యాసాలు రాయడం ఇష్టం. మా అన్న అసోసియేట్ ప్రొఫెసర్ కావడంతో తను చాలా మద్దతిస్తూ నన్ను చదివించాడు. నేను ప్రిపేర్ అవ్వడం మొదలుపెట్టిన ఐదేళ్లు పూర్తిగా నోటిఫికేషన్లు లేవు, అయినా ఆపకుండా చదువుకుంటూ వెళ్లాను. అందుకే వరుసగా ఉద్యోగ ప్రకటనలు రాగానే, అనుకున్నట్టుగా సెలెక్ట్ అయ్యాను.

« జీఎస్ మీద పట్టు బాగా పనికొచ్చింది. సబ్జెక్టు పేపర్‌కు సంబంధించి పరీక్షకు రెండు నెలల ముందు బాగా ఫోకస్ పెట్టాను. లైబ్రరీ సైన్స్‌కి పెద్దగా మెటీరియల్ దొరక్కపోవడంతో ఆన్‌లైన్‌లో చదివాను. నైటింగ్ ప్రాక్టీస్, నోట్ మేకింగ్ అలవాట్లు రివిజన్‌కి బాగా ఉపయోగపడ్డాయి.

« ఇతర అభ్యర్థులకు, నాకు జీఎస్ వద్దే మార్కుల్లో బాగా తేడా వచ్చింది. ఏళ్ల తరబడి చదువుతూ ఉండటంతో అందులో చాలా వరకూ నాకు ఎడ్జ్

ఓపికతో సాధించా..

● కొప్పుల చైతన్య

దొరికింది. సిలబస్‌లో ప్రతి పదం విడిచిపెట్టకుండా చదివాను. దాన్ని దాటి ఏమీ చదవలేదు. 'ఈనాడు' పత్రికలో ఎడిటోరియల్ పేజీ వ్యాసాలు జీఎస్ ప్రిపరేషన్‌లో ఉపయోగించుకున్నాను.

« రోజుకు ఇన్ని గంటలు చదవాలి అని ఎప్పుడూ పెట్టుకోలేదు. పొద్దున్నుంచి కూర్చునేదాన్ని, కనీసం ఆరేడు గంటలు చదివాను. ఒకరోజు ఏదైనా కారణంతో చదవలేకపోతే మరుసటి రోజే కచ్చితంగా ఎక్కువ చదివి మేనేజ్ చేసుకున్నాను.

« నా సన్నద్ధత 2014లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇంట్లో వారి సహకారం మర్చిపోలేను. ఎప్పుడూ నిరుత్సాహపరచలేదు. ఏం చదువుతానన్నా మద్దతు ఇచ్చారు. చిరాకుతో ఆపేద్దాం అనిపించిన ప్రతిసారీ వారే ప్రోత్సహించారు. వారి సహకారం లేకపోతే ఇంత దూరం వచ్చేదాన్నే కాదు, ఇప్పుడు అందరూ చాలా సంతోషంగా ఉన్నారు.

కొత్త కొత్తగా..

కొత్త టెక్నాలజీ ప్రతి రంగాన్నీ ఆక్రమిస్తోంది, ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా చదవాలి. లైబ్రరీ సైన్స్‌లో కూడా కొత్తగా ఎన్నో వచ్చాయి, అన్నీ నేర్చుకున్నాను. సబ్జెక్ట్ ఏదైనా నోట్ మేకింగ్ ప్రధానం. దాని వల్ల చిన్న అంశాలు కూడా గుర్తుంటాయి. రివిజన్ సులభం అవుతుంది. ప్రతిరోజూ చదివితే పరీక్ష టైమ్‌లో ఒత్తిడి ఉండదు.

« నోటిఫికేషన్ ఉన్నా లేకున్నా చదువుతూ ఉంటేనే పోటీ తట్టుకోగలం, ఒత్తిడి లేకుండా పరీక్ష రాయగలం. మాకు మధ్యలో కొన్నిసార్లు నోటిఫికేషన్లు రద్దు చేయడం వంటివి జరిగాయి, కానీ మళ్లీ రాకపోతుందా అనే ఆశతోనే ఉన్నా. ఎక్కడా నిరాశ పడలేదు. ఫలితం కొన్నిసార్లు ఆలస్యం అయినా.. ఏదో ఒక రోజు తప్పకుండా వస్తుంది కదా!

« తల్లిదండ్రులు ఇచ్చే మద్దతు ఆడపిల్లలు బాగా చదివేలా చేస్తుంది. నావరకూ అదే నన్ను ఇంతవరకూ నడిపించింది. తక్షణ ఫలితాలు ఆశించకుండా కష్టపడితే కచ్చితంగా విజయం సాధించగలం!

ఇంటర్న్‌షిప్‌లు

విశాఖపట్నంలో

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్
స్టైపెండ్: నెలకు రూ.9,000
దరఖాస్తు గడువు: మార్చి 11
అర్హతలు: హెచ్ఆర్ అనలిటిక్స్ నైపుణ్యాలు
☛ internshala.com/i/053df2

విజయవాడలో

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ
స్టైపెండ్: నెలకు రూ.20,000
దరఖాస్తు గడువు: మార్చి 13
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో నైపుణ్యాలు
☛ internshala.com/i/c4f26e

వర్క్ ఫ్రమ్ హోమ్

డిజిటల్ ఇష్యూ సంస్థలో..

1.బ్రాండ్ మేనేజ్‌మెంట్

స్టైపెండ్: 10,000
దరఖాస్తు గడువు: మార్చి 13
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, మార్కెటింగ్, సేల్స్ నైపుణ్యాలు
☛ internshala.com/i/d79d87

2.గ్రాఫిక్ డిజైన్

స్టైపెండ్: నెలకు రూ.4,000
దరఖాస్తు గడువు: మార్చి 13
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఇంగ్లిష్, హిందీ మాట్లాడటంలో నైపుణ్యం
☛ internshala.com/i/8ea7c0

ప్రొడక్ట్ మార్కెటింగ్

సంస్థ: అడ్వర్టలిస్ట్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: మార్చి 13
అర్హతలు: ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/f90ada

షార్ట్స్ స్క్రిప్ట్ రైటర్

సంస్థ: ఫియర్‌డాగ్ మ్యూజిక్
స్టైపెండ్: నెలకు రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: మార్చి 13
అర్హతలు: కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/447caf

బయోటెక్నాలజీలో..

జీఏటీ-బి పరీక్షకు రంగం సిద్ధం

పీజీ చేస్తారా!

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ ఏడాది నిర్వహించే జీఏటీ-బి-2024 దరఖాస్తును ఆన్‌లైన్‌లో అధికారిక వెబ్‌సైట్ ద్వారా విడుదల చేసింది. ఎంటెక్, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు ఇదే సరైన సమయం. వీరు వెబ్‌సైట్‌లో ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను నింపి అప్‌లోడ్ చేయవచ్చు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని, దరఖాస్తు నింపి, అవసరమైన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసి, పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆన్‌లైన్‌లో మాత్రమే నిర్వహించే ప్రక్రియ. 2024, ఏప్రిల్ 20వ తేదీన ఈ పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తులను 2024, మార్చి 6వ తేదీ సాయంత్రం వరకూ స్వీకరిస్తారు.

దరఖాస్తుకు అవసరమైన డాక్యుమెంట్లు

- ఈ-మెయిల్ ఐడీ
- ఫోన్ నంబర్
- వ్యక్తిగత వివరాలు
- క్వాలిఫైయింగ్ ఎగ్జామ్ మార్కుల జాబితా
- అప్‌లోడ్ చేయడానికి కావాల్సిన సర్టిఫికెట్లు
- ఫొటో, సంతకాల స్కాన్డ్ కాపీలు.



దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తర్వాత ఎన్‌టీఏ అప్లికేషన్ ఫామ్ కరెక్షన్ విండోను మార్చి 8వ తేదీన అందుబాటులోకి తీసుకొస్తుంది. దరఖాస్తును విజయవంతంగా పూర్తిచేసిన వారు అధికారిక వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షకు హాజరయ్యే సమయంలో అడ్మిట్‌కార్డుతోపాటు ఫొటోతో కూడిన ఒక ఐడెంటిటీ ప్రూఫ్‌ను తప్పక వెంట తీసుకెళ్లాలి. పరీక్ష అనంతరం పాసైన విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తారు. అలా ర్యాంకులు పొందిన వారు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. అనంతరం సీట్ల కేటాయింపు జరుగుతుంది.

● దీని ద్వారా ఎంటెక్ బయోటెక్నాలజీ/అలైడ్ సైన్సెస్, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు.

● ఈ పరీక్ష రాసేందుకు జనరల్, ఓబీసీ - ఎన్‌సీఎల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.1200 ఫీజుగా చెల్లించాలి. అదే ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.600 చెల్లించాలి.

● పరీక్ష ఆన్‌లైన్‌లో 3 గంటలపాటు జరుగుతుంది. పూర్తిగా ఇంగ్లిష్‌లోనే ఉంటుంది.

● మొత్తం 63 విద్యాసంస్థలు ఇందులో పాల్గొంటున్నాయి. వీటిలో 1206 సీట్లు విద్యార్థుల కోసం ఉన్నాయి. దేశవ్యాప్తంగా 56 నగరాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు.

» మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ : dbt.nta.ac.in, nta.ac.in «

అర్హులెవరు?

పరీక్షకు హాజరయ్యేందుకు అభ్యర్థులు తప్పకుండా తమ బ్యాచిలర్ డిగ్రీను బయోలాజికల్, ఫిజికల్, వెటర్నరీ - ఫిషరీ సైన్సెస్, అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్/టెక్నాలజీ, 4 ఏళ్ల బీఎస్సీ (ఫిజీషియన్ అసిస్టెన్స్ కోర్స్), మెడిసిన్ లేదా బీడీఎస్ చదివి ఉండాలి. కనీసం 60శాతం మార్కులు సాధించి ఉండాలి, ఆఖరి సంవత్సరం పరీక్ష రాసేవారూ అర్హులే.

పరీక్ష విధానం

● జీఏటీ-బి 2024 పరీక్షా విధానాన్ని కూడా ఎన్‌టీఏ విడుదల చేసింది. దరఖాస్తుదారులంతా కచ్చితంగా ఆ వివరాలు పరిశీలించడం ద్వారా పరీక్షపై మరింతగా అవగాహన పెంచుకోవచ్చు. ఈ ప్రశ్నపత్రం రెండు విభాగాలుగా ఉంటుంది.

పార్ట్ ఏ - ఇందులో 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది, తప్పు జవాబుకు అర మార్కు కోత వేస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

పార్ట్ బి - ఇందులో ఇచ్చిన 100 ప్రశ్నల్లో అభ్యర్థులు ఏవైనా 60 ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రతి సరైన జవాబుకు 3 మార్కులు లభిస్తాయి, తప్పు జవాబుకు ఒక మార్కు పోతుంది. ఇందులో బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఆలోచించి, విశ్లేషించడం ద్వారా జవాబులు ఇచ్చేలా ఈ ప్రశ్నలుంటాయి.

● బీఈటీ 2024లో సెక్షన్ 'ఏ'లో 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇవన్నీ ఇంటర్ స్థాయిలో జనరల్ సైన్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ బయోటెక్నాలజీ వంటి అంశాల నుంచి అడుగుతారు. వీటిలో ప్రతి సరైన జవాబుకు 3 మార్కులు రాగా, తప్పు సమాధానానికి ఒక మార్కు పోతుంది. అలాగే సెక్షన్ 'బి'లో 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు బయోటెక్నాలజీలోని పలు ప్రత్యేకించిన అంశాలపై అడుగుతారు. అభ్యర్థి వీటిలో ఏవైనా 50 ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలి. ప్రతి సరైన జవాబుకు 3 మార్కులు రాగా, తప్పు సమాధానానికి ఒక మార్కు పోతుంది.

సన్నద్ధత ఇలా..

సాధారణంగా ఈ పరీక్షలో సెక్షన్ ఏ ఇంటర్ స్థాయిలో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరిశీలిస్తే.. సెక్షన్ బి గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఆలోచించి జవాబులు ఇచ్చేలా ఉంటుంది. అందువల్ల దీనికి సన్నద్ధమయ్యే విద్యార్థులు తమ ప్రాథమిక అంశాలకు పదును పెడుతూనే.. ఆచరణాత్మక విధానంలోనూ సిద్ధం కావాలి. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు కూడా సముచిత ప్రాధాన్యం ఉండటంతో సన్నద్ధత సమయంలో వాటికి తగిన సమయం కేటాయించడం తప్పనిసరి. ప్రతి సబ్జెక్టులోనూ ఏ టాపిక్ నుంచి ఎన్ని ప్రశ్నల వరకూ వస్తున్నాయనేది గత పరీక్షల ప్రశ్నపత్రాలు పరిశీలించడం ద్వారా తెలుసుకుని ఆమేరకు సన్నద్ధం కావొచ్చు. సరైన వ్యూహం, స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్ వీడియో నోట్స్, రిఫరెన్స్ పుస్తకాల ద్వారా పరీక్షలో అనుకున్నస్థాయిలో మార్కులు పొందే వీలుంటుంది. సిలబస్‌ను పూర్తిగా అర్థం చేసుకోవడం, అంశాల వారీగా విశ్లేషించుకుంటూ చదవడం, పునశ్చరణ చేయడం తప్పనిసరి. నిజానికి ఈ పరీక్ష సిలబస్ కాస్త ఎక్కువనే చెప్పాలి. అందువల్ల సరైన వ్యూహం లేకపోతే అంశాలు అన్నింటినీ చదివి రివిజన్ చేయడం కష్టం అవుతుంది. ప్రతి సబ్జెక్టుకూ ప్రాథమిక అంశాల కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవడం సన్నద్ధతకు ఒక మంచి ప్రారంభాన్ని అందివ్వగలదు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

టీహెచ్‌డీసీలో ఇంజినీర్ ట్రెయినీలు

ఉత్తరాఖండ్ రాష్ట్రం రిషికేశ్‌లోని తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీహెచ్‌డీసీ) ఇండియా లిమిటెడ్.. 10 ఇంజినీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్.
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ (ఇంజినీరింగ్)తో పాటు గేట్- 2023 స్కోరు.
వయసు: 28.02.2024 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు.
వేతనం: నెలకు రూ.50,000 - రూ.1,80,000 వరకు.
ఎంపిక: గేట్ 2023 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.600. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్/ దరఖాస్తుకు చివరి తేదీ: 29-03-2024.
వెబ్‌సైట్: https://thdc.co.in/en

బెల్‌లో సీనియర్ అసిస్టెంట్ ఇంజినీర్లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్).. ఫిక్స్‌డ్ టెన్యూర్ ప్రాతిపదికన 24 సీనియర్ అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమాతో పాటు 15 ఏళ్ల పని అనుభవం.
వేతనం: నెలకు రూ.30,000 - రూ.1,20,000 వరకు.
వయసు: 50 సంవత్సరాలు మించకూడదు.
పని ప్రదేశాలు: గువాహటి, దిల్లీ, శ్రీనగర్, ముంబయి, కొచ్చి, కార్వార్, పోర్ట్‌బ్లెయిర్, విశాఖపట్నం.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20-03-2024.
వెబ్‌సైట్: https://bel-india.in/

ప్రవేశాలు

శ్రీచిత్ర తిరునాల్‌లో పీజీ, పీహెచ్‌డీ

కేరళ రాష్ట్ర త్రివేండ్రంలోని శ్రీచిత్ర తిరునాల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ.. అకడమిక్ సెషన్ జులై 2024 సంవత్సరానికి పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
1. పీహెచ్‌డీ (ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, బయో ఇంజినీరింగ్, బయోమెటీరియల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మెడికల్ సైన్స్ అండ్ హెల్త్ సైన్సెస్)
2. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ (ఎండీ-పీహెచ్‌డీ, డీఎం/ఎంసీహెచ్-పీహెచ్‌డీ)
3. మాస్టర్ ఆఫ్ ప